క్లుప్తంగా

12న పాలిటెక్నిక్ స్పాట్ కౌన్సెలింగ్

మధిర: పదో తరగతి ఉత్తీర్ణులై పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు ఈ నెల 12న మధిర మండలం ఖాజీపురం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల వద్ద జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని మధిర ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ సాంబయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్, సివిల్ విభాగంలో సీట్లు కావాల్సిన విద్యార్థులు ఈ నెల11 వరకు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 12న స్పాట్ కౌన్సెలింగ్‌లో అడ్మిషన్ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ముమ్మరంగా వైద్య శిబిరాలు

ముమ్మరంగా వైద్య శిబిరాలు

సత్తుపల్లిటౌన్: సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం తెలిపారు. పట్టణంలోని జవహర్‌నగర్‌లో గురువారం గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరాల్లో రక్త పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత ఎన్టీఆర్‌నగర్, అంబేద్కర్‌నగర్, జలగంనగర్, కాకర్లపల్లిల్లో వైద్యశిబిరాలను పరిశీలించి డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వాధ్యులపై అవగాహన నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు, డాక్టర్ అవినాష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముదిగొండ ఎంఈఓగా శ్యాంసన్



మాట్లాడుతున్న ఎంఈఓ శ్యాంసన్

ముదిగొండ: ముదిగొండ మండల విద్యాశాఖ అధికారిగా శ్యాంసన్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన బీవీ రామాచారి సెలవుపై వెళ్లడంతో.. ఆ స్థానంలో శ్యాంసన్ బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని న్యూలక్ష్మీపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని, నాణ్యమైన విద్యను అందించాలన్నారు. సమావేశంలో మండల నోడల్ అధికారి రమణయ్య, ముదిగొండ, చిరుమర్రి, బాణాపురం కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శాంతి, ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వైత్రి, కిషన్ పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే దేశాభివృద్ధి



విద్యార్థులు వేసిన చిత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్: బాలికా విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని తహసీల్దార్ పున్నం చందర్, ఎస్‌ఐ మధుబాబు అన్నారు. ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఎఫర్ట్–క్రైం ఆర్ట్ పేస్ట్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల చదువు ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు వేసిన చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శాస్త్రి, ఏపీఎం పద్మలత, ఎఫర్ట్ సంస్థ కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి, నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని మలుగుమాడు, ఇనగాలి, రాజులదేవరపాడు, రామన్నపాలెం, మీనవోలు, నారాయణపురం, వెంకటాపురం, గ్రామాలకు చెందిన 9మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ. 3.70 లక్షల చెక్కులను కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటకృష్ణారావు, వేమిరెడ్డి అనురాధ, సిద్దారెడ్డి, రాజీవ్‌గాంధీ, వెంకటరెడ్డి, ప్రభాకర్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి

వేంసూరు: మండలంలోని భరణిపాడు గొల్లపూడి బజార్‌లో డ్రెయినేజీ సౌకర్యం లేక వర్షపు నీరు గృహాల్లోకి చేరుతుందని, గ్రామ పంచాయతీ వారు డ్రెయినేజీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు తెలిపారు.

అప్రమత్తతే ఆయుధం..

- అపరిశుభ్రంగా సైడ్ డ్రెయిన్లు
- రహదారులపై నిలుస్తున్న వర్షపు నీరు
- ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు
- పట్టించుకోని అధికారులు

చింతకాని: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో అంటువ్యాధులతో పాటు విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. ప్రజలు కొద్దిగా అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉంటే అంటువ్యాధులు, విషజ్వరాల నుండి రక్షణ పొందవచ్చు. ఈ సీజన్‌లో ఎక్కువగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు వ్యాపిస్తాయి. వర్షం నీరు నిలిచి మురుగు గుంటలుగా మారి వాటిలో దోమలు వృద్ధి చెందుతాయి. సైడ్ కాలువలు, పాతబడిన కూలర్లు, టైర్లలో నిల్వ ఉన్న నీటిలో, నివాస ప్రాంతాల సమీపంలోని రోళ్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారినుంచి తప్పించుకోవచ్చు.

అవగాహన కల్పించాలి..

గత రెండేళ్ల నుంచి వర్షాకాల సీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో తీవ్రమైన స్థాయిలో ప్రజలు విషజ్వరాల బారినపడి.. వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చుచేశారు. వర్షాకాలంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే కొంతమేరకైనా ప్రజలు అవగాహన కలిగి ఉంటారు. కానీ అధికారులు పారిశుద్ధ్య పనులపై హడావుడి చేయడమే తప్ప గ్రామాల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నివారణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి అపరిశుభ్రత తాండవిస్తోంది. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మత్కేపల్లిలో అపరిశుభ్రంగా ఉన్న సైడ్ డ్రెయిన్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సైడ్ కాలువల్లో చెత్తను తీసివేయించి మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి.
- మురుగు నీటిని తొలగించిన తరువాత కాలువల వెంబడి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలి.
- దోమల నివారణకు మందును పిచికారీ చేయించాలి. తాగునీరు కలుషితం కాకుండా చూసుకుంటూ రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ తీరుపై అప్రమత్తంగా ఉండాలి.
- వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
- గ్రామాల్లో కొబ్బరిబొండాల వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు మిగిలిన చెత్తను గ్రామ పరిసరాల్లో పోయకుండా తగలబెట్టేలా చర్యలు తీసుకోవాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి..



ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే.. ప్రజలకు వ్యాధుల భారీ నుంచి కాపాడవచ్చు. కరోనా వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉన్నందున సీజనల్ వ్యాధులపై ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలి.

– ఎండీ అల్తాఫ్, మండల వైద్యాధికారి, చింతకాని

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి..



వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. డ్రెయినేజీల్లో మురుగునీరు నిలిచి దోమలు పెరుగుతున్నాయి. మురుగునీటి నిల్వలపై బ్లీచింగ్ చల్లి ఫాగింగ్ చేయాలి.

– పగడాల అంజయ్య, మత్కేపల్లి, చింతకాని

- ఇంటి ఆవరణలో ఉన్నటువంటి కొబ్బరిబోండాలు, పాత టైర్లు, కూలర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలి.
- ప్రతిరోజు వేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలి. నిల్వ ఉంచిన వాటిని తినకూడదు.
- సాధ్యమైనంతవరకు కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వర్షాకాలంలో వీలైనంతవరకు మాంసాహారానికి దూరంగా ఉంటే మంచిది. పాత్రలపై ఎల్లప్పుడు మూతలు ఉండేలా చూసుకోవాలి.
- జ్వరం, దగ్గు, తలనొప్పి, వంటినొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల్లోని ఏఎన్‌ఎంలను సంప్రదించాలని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



మధిరరూరల్: మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు

మధిరరూరల్/కొణిజర్ల/కల్లూరురూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మధిర మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఏఎస్‌ఎం విజయ తెలిపారు. గురువారం మధిరలోని మాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో.. హెచ్‌ఎం చెరుకుపల్లి శ్రీహరి అధ్యక్షతన, కొణిజర్లలోని సింగరాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో.. హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలు పాఠశాలతో పాటు ఇంటి వద్ద కూడా మొక్కలు నాటాలని సూచించారు. అదే విధంగా కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని, కాల్వల్లో మురికినీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, జీపీ కార్యదర్శి వైవీకే రెడ్డి, కె.సురేష్, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, శ్రీనివాసరెడ్డి, వెంకటరామరావు, రామనుజా చార్యులు, భాస్కర్‌రావు, ప్రసాద్, జానకీ రాణి, మాధవి, పీడీ వెంకటేశ్వర్లు, మాటూరుపేట పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఎంపీఓ సురేష్‌బాబు, ఈజీఎస్ ఏపీఓ హిమమాలిని, ఈజీఎస్ ఏఈ పుల్లారావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కల్లూరులో..

కల్లూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కల్లూరు జీపీ స్పెషలాఫీసర్ రత్తమ్మ అన్నారు. కల్లూరు పీహెచ్‌సీలోని పలుగ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాధులు ప్రబలిన వెంటనే పీహెచ్‌సీలో చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.రామారావు, కార్యదర్శి నాగేంద్రబాబు, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా



కల్లూరు: అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు



కారేపల్లి: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జీపీ వర్కర్లు



ఎర్రుపాలెంలో..

కల్లూరు/ కొణిజర్ల/ కారేపల్లి/ ఎర్రుపాలెం/ ముదిగొండ: తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేస్తూ.. గ్రామ పంచాయతీ వర్కర్లు గురువారం సమ్మె బాట పట్టారు. తెలంగాణ జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కల్లూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కొణిజర్లలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట, సీఐటీయూ ఆధ్వర్యంలో కారేపల్లి, ఎర్రుపాలెం ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ జీపీ వర్కర్ల సంఘం నాయకుడు నరేందర్, షేక్ హుస్సేన్, సీఐటీయూ మండల కార్యదర్శి సంజీవరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విమర్శించిదన్నారు. అదే విధంగా ముదిగొండ తహసీల్ ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే వజీర్ మియా, సహాయ కార్యదర్శి సుధాకర్, సునీత, రాములు, కమలమ్మ, లక్ష్మయ్య, జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేష్, కార్యదర్శి భాస్కర్, జీపీ వర్కర్ల సంఘం నాయకులు నాగేశ్వరరావు, కొమరయ్య, తిరపయ్య, గౌతమ్, శ్రీనివాస్, సత్యం, అశోక్, పద్మ, సుల్తానా, శ్రీనివాసరావు, గోపాలరావు, రవీంద్రబాబు, రామకృష్ణ, నాగేశ్వరావు, రామచంద్రరావు, జమలయ్య, రితీష్, చిన్న, జీపీ కార్మికులు హుస్సేన్, సైదులు, ప్రసాద్, నాగేశ్వరరావు, రవి, చలమయ్య, ఉపేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణాలివ్వాలి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న సొసైటీ చైర్మన్లు

కొణిజర్ల: రుణమాఫీ పొందిన రైతులకు డీసీసీబీ ద్వారా ఎటువంటి షరతులు లేకుండా కొత్తరుణాలు ఇచ్చేలా ఆదేశాలివ్వాలని కోరుతూ.. పలు సొసైటీల చైర్మన్లు రాష్ట్ర వ్యవసాయ, పట్టుపరిశ్రలు, సహకార మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇచ్చారు. కొణిజర్ల, ముదిగొండ, కామేపల్లి, రఘునాధపాలెం సొసైటీ చైర్మన్లు రవి, ఎలగొండ స్వామి, వీరభద్రం, రఘురాం తుమ్మలను ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ప్రజాసేవలో 'జక్కంపూడి'కి సాటిలేరు..

తల్లాడ: ప్రజా సేవలో దివంగత జక్కంపూడి కృష్ణమూర్తి, ప్రేమలత దంపతులకు సాటిలేరని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం బిల్లుపాడులో నిర్వహించిన కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి, సతీమణి ప్రేమలత సంతాప సభలో తుమ్మల మాట్లాడారు. ప్రజాసేవలో కడవరకు పనిచేసి వారు ఆదర్శ దంపతులుగా నిలిచారన్నారు. ఈ సభలో కొత్తగూడెం, వైరా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాలోత్ రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మట్టా దయానంద్, బీబీ స్వర్ణకుమారి, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కొండబాల కోటేశ్వరరావు, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

13న చలో హైదరాబాద్

మధిర: ఢిల్లీ నుంచి ఈ నెల 13న హైదరాబాద్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికేందుకు మాదిగలందరూ హైదరాబాద్ తరలి రావాలని ఎమ్మార్పీఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూరపాటి సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మధిరలో జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కూరపాటి ప్రభాకర్ మాదిగ, ఊటుకూరు రత్నాకర్ మాదిగ, కోట హనుమంతరావు, కొండూరు రాజేష్, బలవంతపు నరసింహారావు, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

వేంసూరు: పట్టపగలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగిన సంఘటన మండలంలోని అమ్మపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోల లక్ష్మి నర్సయ్య, తిరుపతమ్మ వ్యవసాయ పనులకు వెళ్లగా గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు 27 గ్రాముల బంగారం, రూ.2 వేలు నగదు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై వీరప్రసాద్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారును ఢీకొట్టిన లారీ

సత్తుపల్లిరూరల్: కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటన సత్తుపల్లి శివారు పెద్దవంతెనపై గురువారం చోటు చేసుకుంది. సత్తుపల్లి మండలం సిద్దారానికి చెందిన మోరంపూడి రవి కారులో తాళ్లమడ వైపు నుంచి సత్తుపల్లి వస్తుండగా తమ్మిలేరు వంతెనపై గుంత ఉండటంతో వేగం తగ్గించాడు. ఇంతలోనే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు దెబ్బతినగా, రవి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

కల్లుగీత ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

తల్లాడ: కల్లుగీత కార్మికులకు ఉపాధి బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య అన్నారు. గురువారం తల్లాడలో సున్నం నరసింహారావు అధ్యక్షతన జరిగిన గీత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సొసైటీకి 5 ఎకరాల భూమి ప్రభుత్వమే ఇవ్వాలని, ప్రతి గీత కార్మికుడికి ద్విచక్ర వాహనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుల్లారావు, బసవయ్య, వెంకటేశ్వరరావు, రామక్రిష్ణ, శ్రీను, మణికంఠ, రవి, అనీల్, రాఘవ, మహేష్, రమేష్, శివ, నవీన్ పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితులకు సీపీఎం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కారేపల్లి: కేరళ రాష్ట్రం వాయనాడ్‌లో వరద బీభత్సానికి సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధితులకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కారేపల్లిలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి నరేందర్, దేవప్రకాశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు

చింతకాని: మధిర నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు సంబంధించిన స్థలాన్ని మండలంలోని లచ్చగూడెం గ్రామంలో ఐటీడీఏ అధికారులు గురువారం పరిశీలించారు. స్థలం లభ్యత, రహదారి సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్ల ఏర్పాటుకు పైలట్ ప్రాజెక్ట్‌గా కొడంగల్, మధిర నియోజకవర్గాలను ఎంపిక చేయగా, మధిర నియోజకవర్గంలో స్కూల్ ఏర్పాటుకు అనువైన స్థలం చింతకాని మండలం లచ్చగూడెంలోని మినీ స్టేడియం సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఈ హిమజ, ఆర్‌ఐ ఉష, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ లేకుండా అద్దెకు ఆర్టీసీ బస్సులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీఎం, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: శుభకార్యాలు, విహార యాత్రలు, ఇతర అవసరాల కోసం బుకింగ్ చేసుకున్న ఆర్టీసీ బస్సులపై 10శాతం రాయితీ ఇస్తునట్లు సత్తుపల్లి డీఎం యు.రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం సత్తుపల్లి బస్టాండ్‌లో రాయితీ బస్సులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎటువంటి డిపాజిట్ లేకుండా 10శాతం రాయితీతో బస్సులు అద్దెకు ఇస్తామన్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్‌లగ్జరీ, ఏసీ బస్సులు సైతం అధిక తక్కువ ధరలో చార్జీతో బస్సులు అద్దెకు బస్సులు ఇస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలు డిపోలో సంప్రదించాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, సూపర్‌వైజర్లు సుబ్బారావు, చంద్రర్‌రావు, జగన్నాథం, కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో జాతీయ జెండాల విక్రయం



జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

మధిర: మధిర సబ్ పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలను విక్రయిస్తున్నారు. హర్ ఘర్ కి తిరంగా కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని పోస్ట్ ఆఫీస్‌ల్లో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు మధిర పోస్టల్ సబ్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. రూ.25తో జాతీయ జెండాను ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చునని సూచించారు. ఈ నెల13 నుంచి 14 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మధిర పరిసర ప్రాంత ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. మధిర సబ్ పోస్టాఫీస్, బజార్ పోస్టాఫీస్ అన్ని గ్రామాల్లో బ్రాంచ్ పోస్టాఫీస్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అనంతరం మధిర సబ్ పోస్టాఫీస్ వద్ద సిబ్బంది, ఏజెంట్లు జాతీయ జెండాలను ప్రదర్శించారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో సాయిబాబాకి గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సాయినాధుడికి పంచామృతాలతో అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో కమిటీ సభ్యులు వెంకటస్వామి భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ

తల్లాడ: తల్లాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నారాయణపురం ఊర్ధుమాతా పాఠశాల 9,10 తరగతుల పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణగా అందజేశారు. తల్లపురెడ్డి, రామకృష్ణారెడ్డి దంపతులు కుమారుడు హర్షిత్ రామిరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా పేద విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ఆంజనేయులు, కోశాధికారి వెంకట్‌రెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, వేమిరెడ్డి చిన్న కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గెజిటెడ్ ఉద్యోగాలు సంపాదించిన అక్కాచెల్లెలు



కృష్ణకుమారి



సాయిశిరీష

బోనకల్: మండలంలోని చిరునోముల ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఇద్దరు కుమార్తెలు తెలంగాణ పబ్లిక్ కమిషన్ విడుదల చేసిన ఫలితాల్లో గెజిటెడ్ ఉద్యోగాలు సాధించారు. పెద్ద కుమార్తె కృష్ణకుమారి ఆర్‌అండ్‌బీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, రెండో కుమార్తె సాయిశిరీష ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎంపికయ్యారు. ఒకే ఇంట్లో ఇద్దరు అక్కాచెల్లెల్లు గెజిటెడ్ ఉద్యోగాలు పొందడం పట్ల అధికారులు, మండల ప్రజలు, యూటీఎఫ్ మండల కమిటీ అభినందనలు తెలిపారు.

సింగరేణి ఉచిత శిక్షణతో జీవనోపాధి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మధురవాణి షాలెంరాజు

సత్తుపల్లిరూరల్: సింగరేణి సంస్థ అందిస్తున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణతో మహిళలకు జీవనోపాధి లభిస్తోందని కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి షాలెంరాజు అన్నారు. గురువారం సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్, కిష్టారం శిక్షణా కేంద్రాల్లో టైలరింగ్, మగ్గంవర్క్ శిక్షణను పూర్తి చేసుకున్న 139 మందికి రాతపరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో దేవాసు, విజయ సందీప్, ఉషశ్రీప్రహ్లాద్, పద్మజకోటిరెడ్డి, శివకుమార్, బి.నరేష్, సీహెచ్ సాగర్, కౌన్సిలర్ కంటే నాగలక్ష్మి పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ముదిగొండ: ఖమ్మంలో ఈ నెల 18న జరిగే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రాంబాబు కోరారు. మండలంలోని వల్లబి, ఖానాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాల్లో గురువారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అన్వేష్‌గౌడ్, రామారావు, యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.

చెత్తరిక్షాలపై పట్టింపేది ..!

వేంసూరు: మనం వాడే ఏ వస్తువైనా క్రమం తప్పకుండా వాడితేనే మనుగడలో ఉంటుంది. వాడకుండా వదిలేస్తే పనికిరాకుండా పోతుంది. గ్రామాల్లో చెత్త సేకరణకు ఇచ్చిన చెత్త రిక్షాలది ఇదే పరిస్థితి. చెత్త సేకరణకు అందజేసిన రిక్షాలు నిరుపయోగంగా మారి తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి.

మండలంలోని 26 పంచాయతీల్లో..

మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ భారత్ కింద ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించేలా కేంద్ర ప్రభుత్వం 2016లో రిక్షాలను పంపిణీ చేయడంతో కార్మికులు చెత్త సేకరించేవారు. 2019లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమంలో ప్రతీ పంచాయతీకి ఒక ట్రాక్టర్ మంజూరు చేసింది. అప్పటినుంచి రిక్షాలను పక్కన పెట్టారు. అధికారులు కూడా దీని గురించి పట్టించుకోవడం మానేశారు.

భారంగా మారిన నిర్వహణ..

నిధుల కొరతతో పంచాయతీల నిర్వహణ భారంగా మారుతున్న అధికారుల ట్రాక్టర్ వినియోగం వైపు మొగ్గు చూపారు. ఇంధనం ఖర్చు లేకుండ చెత్తను సేకరించే రిక్షాలను పట్టించుకోలేదు.దీంతో గత ఎనిమిది ఏళ్ళగా అవి అలంకరప్రాయంగా మారాయి. నిధులు వృథా అయ్యాయి. ఎక్కువ మొత్తంలో చెత్తను ఒకేసారి సేకరించడగానికి అనువుగా ఉందని ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు.రిక్షాలకు మరమ్మతుల చేసి ట్రాక్టర్ వెళ్లలేని చిన్నచిన్న వీదుల్లో రిక్షాలను వినియోగంలోకి తీసుకురావలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న చెత్త రిక్షా